కాలభైరవుడు



సోమరాజుల వేంకటరామమూర్తి గారు

౧

పాచిపెంట ఫిర్కా రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్య వెల్నాటి బ్రాహ్మణుడు. నలభై యేళ్లు వయస్సు కలిగి పింఛనీకి సగందూరంలో వున్నాడు. తేరగా ధర్మపిండాలు బజాయించి దమ్మిడీ ఖర్చులేకుండా జీతంరాళ్లన్నీ మూటకట్టి పెట్లోపారేశే వుద్యోగాల్లో రివిన్యూ ఇన్స్పెక్టరీ చాలా ఉన్నతస్థానం వహించిందని వాడుక అయినప్పటికీ మన వెంకటసుబ్బయ్య న్యాయంగా దేవుడిమొగం చూసి కాలక్షేపం చెయ్యవలసినవాడే కాని, ఒక శేరు నెయ్యి అయినా యితర్లని నోరు విడిచి అడగవలసిన మనిషి కాడు. ఇంతకూ—ఏం పదిమంది మందున్నారు గనుకనా అతని కుటుంబంలో? ఒక్కగానొక్క పున్నమ్మ అనే ఆడపిల్ల. ఆపిల్లని పన్నెండేండ్ల క్రిందట కని వెంకటసుబ్బయ్యగారి భార్య గతించింది. పంచప్రాణాలూ ఈ పన్నెండేండ్ల పిల్లమీద పెట్టుకుని వుంటాడు మన వెంకటసుబ్బయ్య. స్థూలకాయుడు. అందుకు తోడు పరమకోపం, దూర్వాస మహాముని నెత్తిమొత్తి పుట్టాడేమో అనిపిస్తుంది. ప్రపంచంలో అతని కంటబడిన ప్రతిమనుష్యుడూ, జంతువూకూడా అతని కెప్పుడో ఒకప్పుడు కోపం కలిగించే వుంటారు. ఆ గ్రామంలో అన్నింటికంటే ముఖ్యంగా అతగాడికి ఎక్కువకోపం (భయం కూడాను) కలిగించినది ఒక నల్ల కుక్క. ఒకమాటానల్లకుక్క మన రివిన్యూ ఇన్స్పెక్టరు గారు చెరువుగట్టుక్రింద బాహ్యానికి వెళ్లివస్తూంటే వెంట బడి ఆ డబుల్ పన్నా బ్రాహ్మడ్ని చెరువుచుట్టూ మూడు మార్లు తిప్పి, యింటివద్ద మూడు చెంబుల మంచినీళ్లు తాగించింది. అప్పట్నుంచీ నలుగురు తలార్లు కర్రలు పట్టుకొని అగల్ బగల్ నడుస్తేనేకాని ఆయన సాయింత్రం గుమ్మం కదలడు. ఆ దెబ్బతోటి ఇప్పటికీ ఎక్కడైనా గట్టిగా కుక్క మొరిగిందంటే ఢొక్కచచ్చిపోతాడు పాపం!

ఆవూరు కరణం పేరు శేషయ్య. వెల్నాటిబ్రాహ్మణుడే. వయస్సు పందొమ్మిది సంవత్సరాలుంటుంది. బక్కపలచగా, ఎర్రగా తొగరుదారంలాగుంటాడు. అతడు సాధారణంగా వెంకటసుబ్బయ్యగారింటే వుంటూ తల్లిలేని పున్నమ్మకూ, కాలంమళ్లిన వెంకటసుబ్బయ్యకూ పనుల్లో తోడ్పాతూవుంటాడు. శేషయ్యకి వెనకా ముందూ ఎవళ్లూ లేరు. "ఏక్ నిరంజన్" అని ఏకాకి; అయితే యేకాకి అని సుతలామూ కొట్టి పారేయడానికి వీల్లేదు. ఎందుచేతనంటరా? అతగాడికి పున్నమ్మమీద చెప్ప శీల్లేనంత స్నేహం, అభిమానం, ప్రేమాన్నూ. సాయంకాలం తనకీ తండ్రికీ బియ్యంపడేశి పున్నమ్మ తీరుబాటుగా పెరట్లో జామిచెట్టుదగ్గర కూర్చొని శేషయ్య చెప్పే కథలన్నీ సరదాగా వింటుంది. "అనగనగా ఒక రాజకుమారుడు; వేటకెళ్లాడు; అడవిలో ఒక పెద్దమేడ; ఆ మేడలో ఒక చక్కని పన్నెండేండ్ల బాల"—అని యేమో కథలు చెప్తూవుంటే పున్నమ్మ మనస్సులో అమితమైన సిగ్గు ఉదయించి, ఆసిగ్గు పున్నమ్మయొక్క నీలం ముక్కల్లాంటి కళ్లలోంచి పైకి బలవంతంగా పొంగి వచ్చేటప్పుడు, ఆ వేగానికి కనురెప్పలూరికే అల్లాడిపోవడం; చెక్కులెర్రబారడం; మొగం క్రిందికి వంగడం; పెదవుల మీద చిరునవ్వు; గుండెలు దడదడ— ఇన్నిలక్షణాలు ఒక్కమాటు కనిపించేవి. ఇవన్నీ చూసి మన శేషయ్య చిన్నప్పట్నుంచీ పున్నమ్మని చేరదీసి హాస్యంమాటలు చెప్తూ, ఆమె నవ్వినప్పుడు ముద్దెట్టుకుంటూ వుండిన అలవాటు చొప్పున, ఇప్పుడుకూడా (అంటే 'ఇప్పుడుకూడా'

అని మనం అనుకుంటున్నాము కాని, అసలు వాళ్లు పెద్ద వాళ్లయిన సంగతి వాళ్లకి తెలియదు) ముద్దులూ మురిపాలున్నూ.

౨

ఆ వేళ కార్తిక సోమవారం. రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకటసుబ్బయ్య పగలల్లా ఉపవాసంచేసి సాయంత్రం ఈశ్వరాలయంలోకి పూజకి బయల్దేరాడు. నల్లకుక్క భయంచేత దండపాణులైన యిద్దరు తలారులు వెంట నడిచారు. వెంకట సుబ్బయ్య ఆవేళ సాయింత్రం కరణం శేషయ్యని భోజనానికి పిలిచాడు. నక్షత్రదర్శనం అయినవరకూ వెంకటసుబ్బయ్య శివాలయంలోంచి రాడని తెలిసివుండి పున్నమ్మతో నిరాటంకంగా యిష్టాగోష్ఠి కోసమని శేషయ్య పెరటివేపునుంచి వేంచేశాడు. తనతండ్రి తిరిగిరావడాని కింకా అరగంట వ్యవధి వుందని పున్నమ్మ మడితోనే తీరుబాటుగా కూర్చుంది. శేషయ్య కూడా మడికట్టుకునే వచ్చాడు. ఇన్స్పెక్టరుగారు యింట్లో లేరు. ఇక నేముంది? శేషయ్య పున్నమ్మలిద్దరూ ఒకరి



నొకరు చేరుకున్నారు. స్నేహబంధాలు వాళ్లని దగ్గరగా యీడుస్తూంటే వాళ్ల తరమా మరి? అయస్కాంతం, యినుమూ రెండు చేరుకోవడం స్వభావమే కాదండీ? ఏదైనా ఒక కథ చెప్పమని మామూలుగా పున్నమ్మ శేషయ్యని అడిగింది కాని, కథ పూర్తికావడానికి అవకాశం లేదని చెప్పి, శేషయ్య సంభాషణని స్వవిషయంలోకి దింపాడు.

*   *   *   *

పున్నమ్మ—"సరేకాని, నువ్వు కథల్లో 'ప్రేమ, ప్రేమించడం' అంటావుకదా, అదేమిటో సరిగా చెప్పవూ?"

శేషయ్య—"మహా గట్టి ప్రశ్న వేశావు. 'ప్రేమ' అంటే నాకూ సరిగ్గా బోధపడడం లేదు కాని, అయినా నావుద్దేశం మనవిచేస్తాను, వినుమరి. ఇప్పుడు మనమిద్దరం వున్నాం కదా; నువ్వు దూరంగా వుండి నాకంటికి కనుపించకుండా వున్నప్పుడు నిన్ను చూడాల్ని నామనస్సులో వుంటుంది; తరువాత మీయింటికి వచ్చి నీదర్శనం చేసుకున్నాననుకో—అప్పుడు నువ్వు మాటలాడుతే వినాలని వుంటుంది; ఏదైనా సందర్భంలో నువ్వు నీకోకిలకంఠంతో నాతో ఒక్కమాటాడి, నీకడకండ్ల చూపొక్కటి నామీద పారేశే సరికి నావొళ్లు ఝల్లుమంటుంది; పట్టరాని సంతోషము కలుగుతుంది; పరుగెత్తివెళ్లి నీబుగ్గలు ముద్దెట్టుకుందామా అని కోరిక కలుగుతుంది; అయితే మీనాయన వున్నారని మళ్లీ మనస్సు వెనక్కి లాగుతుంది; అప్పుడు మళ్లీ యిదంతా తలుచుకుంటే సిగ్గు కలుగుతుంది.

పూర్వకవుల గ్రంథాల్లో చెప్పిన 'ప్రేమ' అంటే ఇదే అని నే ననుకుంటున్నాను. ఈ మానం ప్రకారం చూస్తే నేను నిన్ను ప్రేమించానన్నమాట. నామాట చెప్పానుకదా! నువ్వుకూడా నీసంగతి నేనిప్పుడు చెప్పిన సూత్రం ప్రకారం తైపారువేసి చెప్పుమరి."

పున్నమ్మ—"నాకూ నీముఖం చూద్దామని; నీమాటలు విందామని వుంటుందికాని ఒక్కొక్కప్పుడు సిగ్గువేస్తూంటుంది భయముమాత్రం లేదు. స్నేహంపట్ల భయమెందుకూ? అయితే సిగ్గుమాత్రం ఎందుకుండాల్నా అని సందేహం."

శేషయ్య—"సిగ్గు—సిగ్గు ప్రేమయొక్క లక్షణమే. మన ప్రేమలో సిగ్గు తప్పకుండా కలిసివుంటుంది. ప్రేమా, సిగ్గూ నువ్వు వేరువేరుగా భావిస్తున్నావు-అదీ పొరబాటు. అవిరెంగూ వేరుకావు. ఒకదాన్నింకొకటి అనుసరించుకునే వుంటాయి.........సరే, ఈమాటకేంగాని, మీనాన్న నీకోసం ఎన్నో సంబంధాలు చూస్తున్నారు. దేవుడిదయవల్లనూ, నా అదృష్టంవల్లనూ యింతవరకూ అవన్నీ తేలిపోతూవచ్చాయి. నువ్వు పెద్దదా

నివయావు. ఇలాగు ముసుగులో గుద్దులాట వ్యవహారం ఎన్నాళ్ళు? అంచేత, రేపు ఎలాగైనా తెగించి మీనాయన్ని మనవివాహం విషయమై కదప దలుచుకున్నాను."

పున్నమ్మ—"అమ్మయ్యో! అతగాడికి చాలా కోపం. ఒకవేళ కోపంవచ్చి ఆయన నిన్నేమైనా అంటే నాప్రాణానికి బాధిస్తుంది. అది కాకుండా, మాతండ్రి ఇవాళపొద్దున్నుంచీ చాలాకోపంగా వున్నాడు. రేపేమో తాసిల్దారుగారు వస్తున్నారుట. చిన్నప్పుడు ఆయనా, మాతండ్రీ కలిసి చదువుకొన్నారుట, అలాంటితాసిల్దారు మొన్న నేదో ఉద్యోగరీత్యామాతండ్రిని ఆక్షేపించాడుట. అప్పట్నుంచీ మాతండ్రి అతగాడిమీద కారాలూ మిరియాలు నూరుతున్నాడు. అతడూ కోపిష్టేనుట. వీళ్ళిద్దరూ రేపు కలుస్తే ఏం కొంప మునుగుతుందోఅని హడలుగా వుంది. అలాంటిసమయంలో అగ్గిమీద గుగ్గిలం వేసినట్టు నువ్వుగానీ పెళ్లిమాట ఎత్తావంటే చెప్పేదేముంది?"

శేషయ్య—"తాసిల్దారుగారు రేపు వస్తున్నారా?..."

పున్నమ్మ—"ఔను. ఆయన భార్యతోకూడా వస్తున్నారుట. భార్యాభర్తల వ్యవహారాల విషయంలో మన కది మొదటిపాఠం." (ఇద్దరు నవ్వేదురు)

వాళ్ల సంభాషణ అంతమైంది. అందుకుకారణం వీధి వైపునుంచి వెంకటసుబ్బయ్య రావడమే. భోజనాల దగ్గిర వెంకటసుబ్బయ్య ప్రస్తుతాంశము లేమీ మాట్లాడకుండా, మొగం ధుమధుమలాడుతూ పెట్టి, ఎవరినోవుద్దేశించి "పింఛనుకి సిద్ధమైన ముండాకొడుకుని నాకు తప్పెంచుతాడేం? ముసలాడయినాడు వాడికిమాత్రం తెలియవూ, కష్టసుఖాలు? చిన్నప్పుడు తోటలో రేగుపళ్లు ఎత్తుకొచ్చి పారిపోతుంటే తోటవాడు వెంటబెట్టి చావగొట్టాడు—చలపతి రావు—'చల్లన్న—మజ్జిగన్న—పెరుగన్న' అని వుడికించీవాళ్లం; నేటికాలానికి 'ఆస్, పేస్' అని నాలు గింగిలీషుముక్కలు రావడంచేత తాసిల్దారీ అయిందని పీడి కిప్పుడు కళ్లు నెత్తికెక్కాయి. ఎందుకూ? రేపుంది కథ; నాలుగూ మొగం ఎదుట ఝాడిస్తాను" అని మరునాడు రావలసివున్న తహస్సిల్దారు చలపతిరావుపంతుల్ని వుద్దేశించి మాట్లాడుతూ తొందరగా నాలుగు మెతుకులు వేసుకొని దిగ్గున లేచాడు. శేషయ్య ఆలోచనలో మునిగివున్నాడు. పున్నమ్మ తండ్రివాలకం అంతా చూసి, రేపు రావలసివున్న ప్రళయాని కిదంతా ఉపోద్ఘాతం అనుకుని, రే పేమౌతుందో భగవంతుడా అనుకుంటూ, భయపడడం తప్ప మరేమీ చెయ్యలేక వూరుకుంది.

3

మంగళవారంనాడు ప్రొద్దున్న యేడుగంటలు కావచ్చింది. పాచిపెంట వూరి పొలిమేర తూర్పువైపునుంచి ఒక రెండెడ్లబండీ గ్రామాన్ని సమీపిస్తూంది. బండీ ముందువెనకల యిద్దరు బిళ్లజవానులు నడుస్తున్నారు. బండి తహసిల్దారు చలపతిరావు పంతులుగారిదే. చెరువుగట్టు దగ్గిర కొచ్చాక బండీ నిలబడింది. అందులోంచి చలపతిరావుపంతులు దిగాడు. స్థూలకాయుడు కాబట్టి 'దిగాడు' అనీకంటె ఊడిపడ్డాడంటే సరిపోతుంది. చెరువుదగ్గర కాలకృత్యాలు తీర్చుకుని వూళ్లోకి వెళ్లుదామని అతని ఉద్దేశం కాబోలును– కప్పుకొన్న ఎర్రశాలువ బండిలోకి విసిరి, బండిని రివిన్యూఇన్స్పెక్టరు వెంకటసుబ్బయ్య యింటికి తోలమన్నాడు. బండి సాగుతూంది. అదివరకు అప్పుడే అరగంటనుంచి చెరువుగట్టున కూర్చొని దంతధావనం చేసుకుంటూవున్న కరణం శేషయ్య ఇదంతా కనిపెడుతున్నాడు. ఆతాలూకాకి క్రొత్తగా వచ్చిన తహసిల్దారు చలపతిరావుపంతులుగారి దర్శనం అతడింకా చేసుకోలేదు. బాహ్యానికని బండిదిగిన తహసిల్దారు కెదురుగావెళ్లి దండంపెట్టి నిలబడడాని కతనికిష్టంలేక, మించిపోయిన దేముందని, ఊళ్లోనే సావకాశంగా చూద్దామనుకున్నాడు.

చలపతిరావు పంతులు ప్రాతఃకృత్యాలు తీర్చుకుని ఊరుమొగమై బయల్దేరాడు. చెరువుగట్టుమీద వేపచెట్టుదగ్గిరకొచ్చేసరికి–ఏం జెప్పను? – పాపం! – నల్లకుక్క–అతనివెంటపడింది. బ్రాహ్మడు అసలే స్థూలకాయుడు; పరుగెత్తలేడు. పోనీ,ఒకవేళపరుగెత్తుదామా అనుకుందుకి అంతా యేమనుకుంటారో అని భయం. పోనీ, కుక్కని

కొంచెం భయపెడుదామని వెనక్కి తిరిగేసరికి నల్ల నిశరీరం, నిప్పులురాల్తూన్న కళ్లు, నోట్లోంచి వ్రేల్లాడుతూ ఎఱ్ఱని నాలుకతో, కోరలుచూపుతూ మెరుగుతూ పెనుభూతం లాగు, నాలుగుకాళ్ల మీదవున్న కాళికాదేవి అపరావతారమే మో అన్నట్టుగా ఆ బ్రాహ్మడిదృష్టిలో పడేసరికి

“పాపం !-నల్ల కుక్క అతనివెంటపడింది.”

కుక్కని అదమాయించడం సంగతి అలావుండగా, అతగాడికే ప్రాణా లెగిరి పోయాయి. నల్ల కుక్క కోపానికి తానే గురిఅయిన సంగతి తెలుసుకున్నాడు; అందులో యేమీసందేహంలేదు. అకారణంగా ఆ శునకానికి తన మీద అంత ఆగ్రహం యెందుకు రావాలో ఆలోచించడానికి అతనికి కాలంలేదు.ఆలోచించినా ఏంలాభం? చేపలు ఈదడానికీ, పక్షులు ఎగరడానికీ ఏమికారణమో, ఆనల్ల కుక్క స్థూలకాయుల్ని వెంబడించడానికీ అదేకారణం. దాని స్వభావమది. కుక్కజాతికి సబబేమిటి? స్థూలకాయులైతేచాలు: పాచిపెంట నల్లకుక్క వెంటపడిం దన్నమాటే. అంచేతేకదూ మన రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్య ఇవాళవరకూ తనశరీరాన్ని లావుగా సృష్టించినందుకు బ్రహ్మజీదేవుడ్ని మనస్సులో తిట్టుకుంటూ వుండడం!

ఏమైతే నేమి—చలపతిరావు పంతులు కుక్క స్వరూపాన్ని చూడడం, చటాల్న వేపచెట్టు యెక్కడం ఒక్కమారు జరిగించి. ‘ఎక్కడం’ అన్న ముక్క చలపతిరావు పంతులు అప్పుడు చేసిన క్రియకి సరిపోదు; ఇక వేరేపదం ఎక్కడా భాషలో లేదు. ఏమంటారా?—

అతడు మొదటికొమ్మ పట్టుకుని ఒక్కమాటు “ఊమ్” అని విశ్వప్రయత్నంచేసి శరీరాన్ని మీదికి ఒక్క ఊపు ఊపి తనకాళ్ల మధ్యని మీదికొమ్మను గట్టిగా అదిమిపట్టుకున్నాడు. [ఈ ఫీటు స్థూలకాయులకి సాధ్యం అవుతుందా అన్నసందేహం మొదట నాకూ కలిగింది. అయితే “ప్రాణంమీదికి వొచ్చినప్పుడు సాధ్యాసాధ్యాల్తో సంబంధం లేదనిన్నీ, మిన్నొచ్చి మీదపడినప్పుడు అసాధ్యాలే సాధ్యాలౌతా” యని ఊహించాను.] చేతులతో కిందికొమ్మ, కాళ్ల మధ్యని మీది కొమ్మ, మనిమంతా తల్లక్రిందులా, మూపు నల్ల కుక్కవైపూ- నిజంగా చూడవలసిన దృశ్యమే. సృష్టికర్త భూమికి (gravity) ఆకర్షణశక్తి ఎందుకు కల్పించాలా అని చలపతిరావుపంతులు లాసమయంలో చాలా విసుగుకున్నా డనుటలో సందేహం లేదు. ఏమంటారా? తల్లక్రిందులావున్న అతగాడి శరీరంలో వున్న రక్తమంతా మొగానికి దిగింది. అంచేత మొగం బరువెక్కి యెఱ్ఱబారింది. శరీరం బరువు అంతా చేతులమీదా కాళ్లమీదా వుంది. పొరబాట్న గాని కాళ్లపట్టు జారిపోయెనా, క్రిందనున్న నల్లకుక్క పాదాలు కొరికేయడంలో సందేహం లేదు; చేతులు పట్టుగానీ వదుల్తే ముఖం కుక్క కందుతుంది, అప్పుడింక ప్రాణం పోయినట్టే. ఈప్రకారంగా ముచ్చెమటలూ పోసి, బరువుకి వూగులాడుతున్న కొమ్మలు విరిగిపోకుండా వుండడానికిన్ని, చెట్టుమీదవున్న కండచీమలు తన కాళ్లనీ చేతుల్నీ కుట్టకుండా వుండడానికిన్ని, కుక్కకి విసుగుపుట్టి వెళ్లిపోయేటట్టు చెయ్యడానికిన్ని, సర్వేశ్వరుని ప్రార్థిస్తూ అల్లా వున్నాడు. అయితే కుక్క మాత్రం మొండికత్తి “ఎంతసేపుంటావో చెట్టుమీద చూస్తాను కాచూ మరి” అన్నట్టు దృష్టి నిగుడ్చి అక్కడనే స్థిరంగా భైఠాయించింది.

ఈవ్యవహారం అంతా గట్టునివున్న శేషయ్య చూస్తూనే వున్నాడు. సద్బ్రాహ్మడికి గట్టిఆపద వచ్చిందని అనుకుని చలపతిరావుపంతులు కష్టం తొలగిద్దామనీ, కొంతవరకూ అతని మెప్పు పొందుదామని వుద్దేశాలతో, స్వభావతః పరోపకారియైన శేషయ్య వేపచెట్టువైపు పరుగెత్తాడు. సన్నపాటి మనుష్యులికి నల్లకుక్క భయం

ఎంతమాత్రం లేదని అతనికి బాగా తెలుసును. గట్టుకింద నున్న మంచి నునుపైనదీ, బరువైనదీ రాయి నొకదాన్ని కుడిచేతులో సంధించాడు. తన కోపదృష్టులన్నీ చెట్టులోంచి వ్రేల్లాడుతున్న చలపతిరావుపంతులుమీద నిలిపి వున్న నల్లకుక్క మన శేషయ్యని చూడలేదు. కుక్కకీ శేషయ్యకీ మధ్య నైదారుగజాలు ఎడం వుంటుంది. బాగా గురిచూసి శేషయ్య పాషాణం ప్రయోగించాడు. అస్త్రపరీక్షనాడు అర్జునునిబాణం మాయపక్షిని తెగేసినట్టు, ఆ రాయి సరిగా వెళ్లి నల్లకుక్క మూతిమీద తగిలీ సరికి, 'కుయ్యోం' మని దీర్ఘమైన ఒక్కకేక వేసి ఒక్కక్షణమాత్రం వెనక్కి తిరిగి ఆ గ్రామసింహం తోక ముడుచుకుని గ్రామంవైపు దౌడాయించింది

హృదయపూర్వకంగా దైవాన్ని ప్రార్థిస్తూ వుండిన చలపతిరావుపంతులు క్రిందివైపు చూస్తూనే వున్నాడు కాని ఏమిజరిగిందీ కొంచెమైనా ఆతనికి తెలియదు. మనస్సంతా అన్యథా (అనగా భగవంతుని వైపు) వుండడంచేత అతని యింద్రియాలన్నీ స్తంభించి పోయాయి. గజేంద్రమోక్షంలో "లావొక్కింతయు లేదు" అన్న పద్యంలో చెప్పినట్టుగా వున్నాడు మన చలపతిరావు పంతులు. అలాంటప్పుడు కర్ణకఠోరమైన శునకస్వనం చెవిని పడేసరికి అతనియింద్రియాలన్నీ ఒక్కమారు మేలుకున్నాయి. త్రుళ్లిపడి భయంలో కాళ్లపట్టు వదిలేశాడు. వొదిలీశాడేమిటి! వదిలిపోయింది. తరువాత చేతులొదిలేశాడు. ప్రమాదవశాత్తు మొదట చేతులూ, తరవాత కాళ్లూ వొదిలివుంటే చాలా ప్రమాదం సంభవించేదే. భూమిమీద పాదాలపైని పడ్డాడు. పూర్తిగా తెలివివచ్చి చూశాడు. కుక్క అంతర్ధానం అయింది. ఎదురుగా చిరునవ్వుతో వున్న శేషయ్య అతనిదృష్టిలో పడ్డాడు. చక్రప్రయోగంచేత మకరాన్ని సంహరించి గజరాజుని రక్షించిన నాటి విష్ణుమూర్తి తన పాలిటకూడా ఆవేళ ఆ 19 ఏండ్ల కుర్రాడిరూపంగా సాక్షాత్కరించాడేమో అని అనుకున్నాడు చలపతిరావుపంతులు. చెట్టులోనుంచి తానుచేసిన ప్రార్థన పూరికే పోలేదన్న సంతోషముతో చల్లపొంగరంలాగు గుండ్రముగా స్ఫోటకపుమచ్చలతో నున్న అతని ముఖం వికసించింది. నవ్వుతూ ప్రశంసాపూర్వకంగా శేషయ్యని కౌగిలించుకొని, "నాయనా! నాపాలిట దేవుడిలా గొచ్చావు; ఎవరిచిన్నవాడవోయి తండ్రీ? నీపేరేమిటి నాయనా?" అని ప్రశ్నించాడు చలపతిరావుపంతులు. "నా పేరు శేషయ్యంటారండి; నేనీ వూరి కరణాన్నండి" అని శేషయ్య అనేసరికి తాసిల్దారుగారు మొదట కొంచెం సిగ్గుపడినప్పటికీ (ఒక తహసిల్దారు ఒక కుక్కకారణంచేత కరణంయెదుట లాచారీ అవడమనేది సిగ్గుకి కారణం కాదూమరి) వెంటనే నవ్వేసి, "చూశావూ. వెధవముండాకుక్క! నన్నుకూడా చెట్టెక్కించిం:" అని గట్టిగా దిశలు బ్రద్దలయ్యేటట్టు నవ్వాడు! తరువాత యిద్దరూకలిసి వూర్లోకి లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ నడిచారు

౪

శేషయ్య తాహసిల్దారుకి వెంకటసుబ్బయ్యగారిల్లు మారంనుంచే చూపించి, మలుపుతిరిగి పెరటిదారిని ఆయింట్లోకే ప్రవేశించాడు. పున్నమ్మ పెరట్లో ఒక్కర్తే కూర్చొని నాల్గోవాచక పుస్తకంలో సింహంపాఠం చదువుకుంటోంది. శేషయ్య రాగానే ఆమె పుస్తకం మూసేసి, మందహాసంతో, "శేషూ! తహసిల్దారుగారి



భార్య వచ్చింది. మనయింటిపొరుగునున్న సావడిలో బస చేశారు. ఇంకా ఆయన వొచ్చినట్టులేదు. వారు వచ్చాక మానాన్న, ఆయన ఏమి కలబడుతారో అని భయంవేస్తూంది" అన్నది. ఆమాటలు విని, "చలపతిరావు పంతులుగారూ నేనూకలిసి యిప్పుడే వస్తున్నాం; అతడు చాలా మంచివాడులాగు కనిపిస్తున్నాడు. మీ నాయనకీ అతనికీమధ్య మరేంప్రమాదం సంభవించినా నేనున్నానుగా అన్నీ సరిచెయ్యడానికి" అని గర్వంగా శేషయ్యపలికిన పలుకులు పున్నమ్మకి అర్థంకాకపోవడమే కాకుండా, రాబోయే గాలివానలో తన శేషయ్యకు ఏమి ఆపద వస్తుందో అని విచారించింది. ఈ వ్యవహారంలో శేషయ్యని ఏమీ జోక్యం కలుగజేసుకోవద్దని చెప్పేదేకాని ఇంతలో ఎక్కడో 'అమ్మయ్యో' అన్నట్టుగా ఒకఆర్తధ్వని వినిపించింది. స్త్రీకంఠస్వరం. సంగతేమిటో కనుక్కుందామని శేషయ్య వీథిలోకి ఒక్కఅడుగు వేశాడు. అక్కడేం కానరాలేదు. పొరుగున చావడిలోకి తొంగిచూశాడు. తహసిల్దారుగారి వంటమనిషి (అన్నవకర్త) ఒకమూలని తడకలగదిలో వంటచేసుకుంటూంది. తహసిల్దారు యింట్లో లేడు. రివిన్యూఇన్స్పెక్టరూ, అతనూ కలిసి కొన్ని యెండిన పొలాలు పరీక్షించి, వ్యవసాయదారుల రెమిషన్ అర్జీలు విచారించడానికి వెళ్లిపోయారు. 'అమ్మయ్యో' అన్నధ్వని ఆయింట్లోంచే వచ్చియుండాల్ని వూహించి శేషయ్య లోపల ప్రవేశించాడు. పెరటిద్వారంలో అతనికి కనపించిన దృశ్యం అత్యద్భుతము! ఆశ్చర్యమైనసంగతి! నూతి దగ్గర అప్పుడే స్నానంచేసి తడిచీరతో, కాలం మళ్లినది, స్థూలశరీరంగలది అగు ఒకానొక ముత్తైదువ ద్వారానికి ఎదురుగుండా ముఖంతిప్పి నిలబడివుంది. ఆమె ముఖంవల్ల ఆవిడ భయభీతయైనదని స్పష్టమవుతుంది. గుమ్మంలో శేషయ్యవైపు వీపుతిప్పి అనగా అవిడవైపు ముఖముంచి—నల్లకుక్క! ఆ ముత్తైదువే తాసిల్దారుగారి భార్య. పేరు లక్ష్మీబాయమ్మ. పురుషసింహం చలపతిరావు పంతుల్నే ముప్పతిప్పలా పెట్టిన నల్లకుక్క యాకృతి స్త్రీయగు లక్ష్మీబాయమ్మను భయపెట్టిందనుటలో ఆశ్చర్యమేముంది? అయితే దైవాత్తు లక్ష్మీబాయమ్మ చేతులో చెంబు వుండడంచేత కుక్క దూరంగా కూర్చునే, తినకు స్థూలకాయులగు మానవులమీదనున్న కోపం అంతా అభినయరూపంగానే చూపుతూంది కాని, ఆ యిల్లాలిని సమీపించి నోటితో క్రియారూపంగా ప్రకటించడానికి ధైర్యం చాలింది కాదు. ఇలాంటి సందర్భంలో మన శేషయ్య వచ్చిన సడి కాగానే కుక్క వెనక్కి తలతిప్పి చూచింది. చూడడమే తడవుగా — మోరయెత్తి "కుయ్యో!" మని చెరువుగట్టుమీద తిన్న దెబ్బనొప్పి అంతా ఒక్కమారు దానికి అనుభవంలోకి వొచ్చినట్టుగా అరచి, చెరువుగట్టుమీద ప్రొద్దున్న ప్రారంభించినపాట యిక్కడ పూర్తిచేసింది; పిమ్మట గోడమీది కొక్క లఘువేసి అదే పరుగు, వాయువేగ మనోవేగాల్తోను. "ఎవ్వరు నాయనా నువ్వు- మాదొడ్డ కుర్రాడిలా గున్నావు? నీదృష్టి కాగలేక వెధవకుక్క పరుగుచ్చుకుంది. నువ్వు రాకపోతే నా పనేమైయుండేదో నోయి బాబూ! స్నానం చేస్తుంటే గోడదిగి ద్వారంలోవొచ్చి చక్కా కూర్చుంది. పాపం రివిన్యూ ఇన్స్పెక్టరుగారి అమ్మాయి వాళ్లింట్లో స్నానం చెయ్యమంటూనే వుంటే బుద్ధిలేక యిక్కడ స్నానం చెయ్యడానికని వచ్చాను వొచ్చినందు కనుభవించాను. పాపం! ఆపిల్ల మాదొడ్డపిల్ల, మణిపూస! పనిపాట్లు ఎంతశ్రద్ధగా చేసుకుంటుంది? తల్లిలేని పిల్లట పాపం! ఏదో ఒక లోపం!...నాయనా! నీపేరేమిటో చెప్పావుకావు?" అని తునకి ప్రశ్నించింది. పేరు చెప్పడానికి అసలు సావకాశం కలుగుతే కాదూ మన శేషయ్యకి! కొందరిస్త్రీలకు సహజమైన గుణం ఏమిటీ అంటే, ఒక్క అంశంగురించి మాట్లాడుతూ వున్నప్పుడు వాళ్లకి జ్ఞాపకంవచ్చిన కబుర్లన్నీ యాకరుపెట్టడమే— అవిసందర్భమైనా సరే, అసందర్భమైనా సరే; ప్రస్తుతమైనా సరే, అప్రస్తుతమైనా సరే; లక్ష్మీబాయమ్మగారి అప్రస్తుత ప్రశంసమధ్యని శేషయ్య జవాబుచెప్పక వూరుకోవలసి వచ్చింది. ఆవిడ ధోరణి సన్నగిల్లిన తర్వాత శేషయ్య, "నా పేరు శేషయ్యంటారండి, నే నీవూరికరణాన్నండి" అంటూ తొందరగా వీథులోకి నడిచాడు. కొలది కాలంలోనే తాసిల్దారంతవాడి చేతనే కాకుండా తాసిల్దారుకి తాసిల్దారయిన (చలపతిరావుపంతులు భార్యకు భయపడి నడుచుకుంటూంటాడని బిళ్లజవాన్ల గుసగుసల

ద్వారా వెల్లడి) లక్ష్మీబాయమ్మచేత కూడా మెప్పు పొందడి, పొగడ్తలందినందుకు మన శేషయ్య గర్వానికి మేర లేకపోయిందంటే ఆశ్చర్యం లేదు. అందులో లక్ష్మిబాయమ్మ పున్నమ్మయెడల చూపిన మాటల సానుభూతి చూస్తే, ఈ వ్యవహారం అంతా సమయం వచ్చినప్పుడు, శేషయ్య పున్నమ్మల వివాహానికి సహాయం చేసితీరుతుందని అతనికి నమ్మకం కలిగింది.

ఇలాంటి ఆలోచనలతో అతడు వీథులోకి వచ్చేసరికి ఎదురుగా వున్న సుబ్బయ్యగారి యింట్లోంచి ఏవో కేకలు వినుపించాయి. మాటలస్వరంబట్టి రివిన్యూ ఇన్స్పెక్టరు వెంకట సుబ్బయ్యకీ, తాసిల్దారుగారగు చలపతిరావు పంతులుకీ ఏదో వాగ్వాదం జరుగుతూందని మన శేషయ్య గ్రహించాడు. వాలకం అంతా చూస్తే, పున్నమ్మచెప్పినట్టు వారిద్దరూ కలబడ్డారని అతనికి స్పష్టమైంది. ఇదే సమయ మనుకుని మెల్లిగా

సుబ్బయ్యగారింట్లోకి ప్రవేశించాడు శేషయ్య. గది గుమ్మందగ్గర నిలబడ్డాడు. లోపలనున్న ఆఫీసర్లిద్దరికీ వ్యవహారం సుతిమించి రాగంలోకి దిగింది.__"నువ్వు చిన్నప్పుడు తోటలో రేగుపళ్లు దొంగిలించి తోటవాడి చేత చావదెబ్బలు తిన్నావు, నువ్వా నాకు చెప్పడమే నట్రా, చల్లన్నా!" అని వొకరు; "నువ్వు మాత్రం ఏం బుద్ధిమంతుడ వని? మూడో క్లాసు చదువుతూ వున్నప్పుడు నువ్వు మేష్టరు కాంతారావుగారి డస్కులో సిరా పారబోసి, మేష్టరు, 'ఎవరు పోశార్రా?' అని అడిగేసరికి గుప్చుప్‌గా ముంగిపోతులాగు వూరుకొని, తరువాత మేష్టరుకి తెలిశాక బెత్తంతో దెబ్బలు తినలేదట్రా, సుబ్బన్నా?" అని యింకొకరు. ఇలాగు మాటలు మహా జోరైపోతూవుండడం విని, శేషయ్య, ఇకనూరుకుంటే సిగ్గుకి చేటేమో అని వూహించి, తలుపు మెల్లిగా తోసుకొని గదిలో ప్రవేశించి చూసేసరికి "చల్లన్న సుబ్బన" లిద్దరికీమధ్యని జానెడేడమైనా లేదు. జామెట్రీలో రెండువర్తులములొకచోట



కలిసిన రీతిచెప్పినట్టుగా వాళ్ల యిద్దరి పొట్టలూ అప్పుడే ఒకదాన్నొకటి అంటుతూ వున్నాయి; మొగాలు బాగా కాలిన మినపరొట్టెలాగు ఎర్రబారాయి; కోపం యిద్దరి ముఖాలమీద తాండవిస్తూంది; ఇద్దరు పళ్లు పటపటకొరుకుతున్నారు; పిడికిళ్లు గట్టిగా మూసి, ఆపిడికిళ్లలో ఒకరినొకరు నలిపి ముద్దచేసేస్తున్నారేమో అన్నట్టుగా వున్నారు. ఇలాంటి సమయంలో వాళ్లిద్దరూ తలుపుసడి

విన్నారు. ద్వారంలోవున్న శేషయ్యని చూశారు. ఉపన్యాసాని కిదేకాలమని వెంటనే మన శేషయ్య, "ఇదిగో, మీరిద్దరూ ఒకడిపార్టుమెంటు వుద్యోగస్థులు. చిన్నప్పుడు చదువుకున్న వాళ్లు. స్నేహంగా వుండకుండా పందెముకోళ్లలాగు ఒకరితో ఒకరు కాట్లాడుతూవుంటే బాగుండదు. నేను మీతాబేదారుని; వీథిలో జవాన్లున్నారు; మాఅందరికీ ఈ అసందర్భం తెలిస్తే ఏంబాగుంటుందో ఆలోచించండి" అని, నల్లకుక్క కారణంచేత ఇదివరకే తాసిల్దారుని జేబులోవేసిన ధైర్యంతో; లెక్చరు వొదిలాడు. ఆ ఉపన్యాసం తను అనుకున్నట్టుగా వాళ్ల కోపాన్ని తొలగించి, లజ్జను ఆవేశింపజెయ్యడం చూచి, మనస్సులో సంతోషించి, శేషయ్య వ్యవహారం చక్కపడుతుందని యెంచి,ఆనాటకంలో సూత్రధారము వహించుతే తనమాటలు వారిద్దరూ వినే అవస్థలో వున్నారని ఆలోచించి, మరింత ధైర్యం తెచ్చుకొని, తన రెండుచేతులతో వారిరెండు కుడిచేతులు కలిపి, "ఇక మీరు స్నేహంగా వుండాలి" అంటూ మళ్లీ యేదో కొద్దిగా లెక్చరు సాగిద్దామనుకుంటూంటే, రెండువేపులావున్న సుబ్బయ్య చలపతు లిద్దరూ ఒకరినొకరు కౌగిలించుకొనే ప్రయత్నంలో వున్నారని తెలిసికొని, వాళ్లిద్దరి మధ్యనూ ఆలాంటప్పుడు నిలబడివుంటే ఆపొట్టలమధ్యని అడకత్తెరలో పోకచెక్కలాగు నలిగిపోతాడేమో అన్న భయంచేత, మెల్లగా ప్రక్కనుంచి జారి, ఆ ముసలి ఆఫీసర్ల పశ్చాత్తాపాన్ని సూచించే గాఢాలింగనాన్ని, కొంచెం దూరంగా నిలబడి, కన్నుల పండువుగా చూశాడు. "నన్ను నువ్వే మొదట చల్లన్నా అన్నా"వని ఒకరు; "నన్ను సుబ్బన్నా అన్నా"వని మరొకరు. "నీతో ఎప్పుడూ పోట్లాడనని చెంపలు వేసుకుంటున్నా"నని ఒకరు; "నీతో ఎప్పుడూ కోపంగా మాట్లాడనని చెవులు నులుపుకుంటున్నా"నని మరొకరు. "తెలివి తక్కువచేత నిన్ను అనిన మాటలు క్షమించు" అని సుబ్బయ్య; "బుద్ధి లేక నీమీద కోపంగా కేకలేసినందుకు క్షమించు" అని చలపతిరావుపంతులు. పిమ్మట, వచ్చిన పశ్చాత్తాపం బాష్పరూపంగా పొంగి వాళ్ల బొజ్జల మీంచి పారేదేకాని, ఇంతలో ఒక విశేషం జరిగింది.

వెంకటసుబ్బయ్యకోపం చల్లారుతూవున్నప్పుడు అతగాడిదృష్టి ద్వారంలో నిలబడివున్న శేషయ్యమీద పడింది. జరిగిన ముచ్చటంతా అతని ఊహలోకి వచ్చి, "ఒక్కముక్క పచ్చలారని కుర్రాడు, ఇంతనాటకం చేస్తాడా!" అని పోతూవున్న కోపం మరలివచ్చింది. "శేషయ్య! నువ్వెలాగొచ్చావు, ఈ వ్యవహారంలోకి? ఏదో సాటిశాఖ వాడివని పూరుకుంటూంటే, నీ అధిక ప్రసంగం ఎక్కువవుతూంది! నీ కక్కరలేని ప్రసంగం లేదు, మా పెద్దమనిషిలాగు! కుర్రముండాకొడుకులు కుర్రముండాకొడుకుల్లా గుండాలి!" అని అసంతృప్తి, ఆగ్రహం కనబర్చాడు సుబ్బయ్య. ఈమాటలు విని, చలపతిరావు పంతులు, "ఇదిగో ఈ కుర్రాడ్ని ఏమన్నా అంటే నే నొప్పుకోను, జాగ్రత్త; కుర్రాడు చాలా బుద్ధిమంతుడు. ఇప్పు డితడు లేకుంటే మనమిద్దరమూ గాడిదలకంటే నీచంగా ప్రవర్తించి వుందుము. కృతజ్ఞత చూపడానికి మారుగా కోపపడుతున్నావూ!—రావోయి శేషయ్యా! ప్రొద్దున్న నువ్వు చూపినధైర్యం ప్రశంసనీయము" అని చలపతిరావుపంతులు ఆయువకుని చెయ్యి పట్టుకున్నాడు. సుబ్బయ్య కిదేమీ అర్థం కావడం లేదు. తహసిల్దారు కరణంగాడిని చెయ్యిపట్టి 'రావోయి బాబూ!' అని లాగడం అతగాడి సర్వీసులో ఎక్కడా అనుభవానికి రాకపోవడంచేత తెల్లమొగంవేసి, "వీడు కరణం శేషయ్య, ఎవరనుకున్నావోకాని!" అన్నాడు. ఆమాట విని చలపతిరావుపంతులు, "తెలుసును; కరణమైతేనేం, మనిషే. ఈ కుర్రాడివాళ ప్రొద్దున్న చెరువు గట్టుమీద లేకపోతే నల్లకుక్క నన్నేంజేసి వుండేదో?"—"చెరువుగట్టు, నల్లకుక్క" ఈరెండుముక్కలూ చెవినిపడేసరికి వెంకటసుబ్బయ్య తేలుకుట్టినట్టు గెంతాడు. ఆరునెలలక్రిందట చెరువుగట్టుమీద తనకూ నల్లకుక్కకూ జరిగిన ముచ్చటంతా అతనికి జ్ఞాపకం వచ్చింది. దాంతో బిక్కమొగంవేసి వెంకటసుబ్బయ్య "ఏమిటీ? నల్లకుక్కా?" అని ప్రశ్నించేసరికి చలపతిరావు పంతులు కొంచెంసేపుక్రితం జరిగినసంగతి యావత్తూ పూసగుచ్చినట్టు చెప్పి, శేషయ్య ధైర్యాన్ని మరల ప్రశంసించి ముగించాడు. సాంతముగా విని, వెంకట

సుబ్బయ్య, "అబ్బ శేషూ! మనవూరి నల్లకుక్కని సాధించావట్రా నాయనా! ఎంతగట్టివాడవు!" అని వీపుమీద తట్టాడు.

ఇంతలో తాసిల్దారుగారి భార్య లక్ష్మీబాయమ్మ రంగంలోకి ప్రవేశించింది. ఆ యిల్లాలిని చూడడంతోటే చలపతిరావుపంతులు, ఒక్కమాటు తాంబేలు తన శత్రువుని చూసేసరికి తన అవయవాలన్నీ బురికింద దాచుకున్నట్టుగా, చిన్నవాడైపోయాడు. అతని సంతోషం అంతా మాయమై పోయింది. అయితే భార్యమొగం నవ్వుతూవుండడం చూచి అతనికి కొంచెం ధైర్యం కలిగింది. లక్ష్మీబాయమ్మగారు తహసిల్దారు గార్ని, రివిన్యూఇన్స్పెక్టరుగారిని చూచి, "ఓహో! బాల్యస్నేహితులుకామా మరి! వంటయింది స్నానానికి లెండి" అని ముసిముసినవ్వుతో అన్నది. "శేషయ్య లేకపోతే మా బాల్యస్నేహం బండలయ్యే"దని మనస్సులో వాళ్లిద్దరూ అనుకున్న సంగతి ఆమెకేం తెలుస్తుంది? ఇంతలో లక్ష్మీబాయమ్మ శేషయ్యవైపు తిరిగి, "ఇదిగో, ఈఅబ్బాయికూడా ఇక్కడే వున్నాడూ? నాయనా! ఇందాక చెప్పకుండానే వొచ్చేశావు! నిన్న భోజనానికి పిలుద్దామని అనుకుంటూంటేనే వొచ్చేశావూ?" అనేసరికి, సుబ్బయ్య తనలో— "పిల్లందరకీ వెర్రా యేమిటి? ఈమాటలు నాకేమీ అర్థం కాకుండా వున్నాయి. ఈపోగట్టంతా నిజంగా శేషుగాడికే!" అనుకుంటూండేసరికి, లక్ష్మీబాయమ్మ సుబ్బయ్యవైపు తిరిగి, "సుబ్బయ్యగారూ! మీరుకూడా మా బసకి భోజనానికి రావాలి. మరేం అడ్డుచెప్పకూడదు" అని మరల శేషయ్యవైపు తిరిగి, "నాయనా! నువ్వంటే నల్లకుక్కకి సింహస్వప్నమోయి!" అనేసరికి చలపతిరావుపంతులు, సుబ్బయ్య యిద్దరూ గతుక్కుమన్నారు. "మళ్లా నల్లకుక్కేమిటి?" అని యిద్దరూ ఏకకంఠంతో పలికారు. అప్పుడు, లక్ష్మీబాయమ్మ ఒక పావు గంటక్రింద స్నానంచేసినప్పుడు జరిగిన సమాచారం అంతా తెలిపింది.

ఇంతలో ఈగోలంతావిని పున్నమ్మకూడా లోపలినుంచి గదిలోకి వచ్చి ఒకమూలని ముసిముసినవ్వు నవ్వుతూ నిలబడ్డది. శేషయ్య దృష్టి వెంటనే చెదరిపోయింది. పున్నమ్మ చిరునవ్వు శేషయ్య పెదవులమీదకూడా మందహాసచంద్రికని ఉదయింప జేసింది. శేషయ్య మందహాసం గర్వసూచకంగా కూడా వున్నది. లక్ష్మీబాయమ్మగారుచెప్పిన నల్లకుక్క కథనుగురించి తదేకధ్యానముతో ఆలోచిస్తూ వుండిన వెంకటసుబ్బయ్య శేషుమీద కలిగిన సంతోషాన్ని పట్టలేక అతన్ని కౌగిలించుకుని, "బాబూ శేషూ! 'కాలభైరవు'ణ్ణి (ఆగ్రామంలో స్థూలకాయులంతా కలిసి ఆనల్లకుక్కకి 'కాలభైరవు' డని నామకరణం చేయించారు)లొంగదీశావ్రటా!" అంటూ వుంటే శేషయ్య బుర్రలో అనేక ఊహలు బయల్దేరాయి. వెంకటసుబ్బయ్యవంటి కోపిష్టికి కూడా తనమీద అనుగ్రహం కలిగిందని చూచి, 'పర్వాలేదు,జయించా'ననుకొని, శుభముహూర్తం మించిపోకుండానే,అనగా వెంకటసుబ్బయ్య బాహుచక్రంలో వుండినప్పుడే, మన శేషయ్య ఈవిధంగా లెక్చరు ఆరంభించాడు: "సుబ్బయ్య మామా! నామనస్సులో నాలుగు ముక్కలూ చెప్తున్నాను విను. ఇన్నాళ్లనుంచి నీతో చెప్పడానికి సాహసించలేదు, నువ్వేమంటావో అన్న భయంచేత" అనేసరికి వెంకటసుబ్బయ్య ముఖకమలం దళితమైంది. ఇది చూచి శేషయ్యకి మరింత ధైర్యం కలిగి, "మామా! మరేం లేదు: ఇదుగో మీపున్నమ్మ! మాయిద్దరి వివాహానికి నువ్వు అనుమతిచ్చావంటే, మాయిద్దరికీ తృప్తికలిగించినవాడి వౌతావు"అని నాలుగుముక్కలూ తణుకూ బెణుకూ లేకుండా ఒక్కవూపిరిలో బజాయించాడు. ఈమాటలు వినేసరికి వెంకటసుబ్బయ్య ముఖంలో గొప్పమార్పు కలిగింది. స్వచ్ఛమైన సూర్యరశ్మితోనిండి కలకలనవ్వుతూ వున్న భూప్రదేశముమీద ఒకమాటు మబ్బువేసి నట్లయింది. కోపం వచ్చింది. ఆకోపంలో శేషయ్య అతనిచేతుల మధ్య ఏమైపోయివుండునో కాని, యింతలో చలపతిరావుపంతులు మాటల కుచ్చుకున్నాడు: "అభ్యంతరం ఏముంటుంది? ఈడుజోడు సరిగ్గా సరిపోయింది; నాకు ఆడపిల్ల లేక పోయిందికాని—" ఇంతవరకూ చెప్పి చలపతిరావుపంతులు భార్యవైపు ఒకపిరికిదృష్టి వేసి గప్పుమని మౌనం ధరించి బిక్కమొగం వేశాడు. తనభార్యవుద్దే

శం తెలియకుండా, తనమనస్సులోమాట బాహాటంగా వెలిపుచ్చినందుకు అతడు పశ్చాత్తాప పడుతూ, ఏంకోపమునుగుతుందో అని భయపడ్తూవుంటే లక్ష్మీబాయమ్మ నవ్వుతూ, "సందేహ మేమిటివి? నాకుగానీ ఆడపిల్లవుంటే క్షణంలో నేను దానిని శేషయ్యకిచ్చి పెళ్లి చెయ్యనూ!" అన్నది. చలపతిరావుపంతులు 'బ్రతుకుజీవుడా' అనుకుని బాగా వూపిరి తీశాడు. చలపతిరావు పంతులు, ఆతని భార్య—వీరిద్దరివాక్యాలు సమయానికి టంకంపొడివేసినట్టు పడేసరికి మన శేషయ్య సంతోషానికి మేరయెక్కడిది? కార్యమంతా సానుకూలంగా నడుస్తూవున్నందుకు అతడు తనలోనే ఈశ్వరునికి ధన్యవాదాలు సమర్పించాడు.

ఇంతమంది, యిన్నివైపులనుంచీ తనమీదకి దండెత్తేసరికి వెంకటసుబ్బయ్యమాత్రం ఏంజెయ్యగలడు? అతడు ముఖముతిప్పి మూలనున్న కూతురువైపు చూశాడు. అప్పుడు పున్నమ్మముఖం కొంచెంప్రక్కకితిప్పి, మందహాసంతో గోడమీద చూపుడువ్రేలితో ఏదోగీస్తోంది. పున్నమ్మ భావంకూడా సుబ్బయ్యగారికి వ్యక్తమైంది. విచారణ ముగిశాక సెషన్సుకోర్టులో జడ్జీగారు జడ్జిమెంటుయిచ్చినట్టు గంభీరంగా వెంకటసుబ్బయ్య, "ఇంతమంది చెప్పాక తప్పుతుందామరి! 'జనవాక్యంతు కర్తవ్యం' అన్నారు; మీయిష్టమే నాయిష్టమూను" అన్నాడు. అప్పుడు లక్ష్మీబాయమ్మగారు మూలను ముసిముసి నవ్వులతోవున్న పున్నమ్మని చెయిపట్టి తీసుకొచ్చి, ఆమెచెయ్యిని శేష



య్యచేతిలో కలిపి, "ముందు బాజాలతోను, మంత్రాలతోను కాబోయే పాణిగ్రహణ మహోత్సవాని కిది రిహార్సు" అని తనయింగ్లీషు పదప్రయోగానికి పక్కున నవ్వింది.

* * * *

మాఘ మాసంలో శేషయ్య పున్నమ్మల వివాహం జరిగింది. పెళ్లిలో తాసిల్దారు చలపతిరావుపంతులు గారు పెళ్లికొడుకు శేషయ్యపేర వెయ్యిరూపాయల కట్నం చదివించారు (అనగా భార్యఅనుమతి తీసికొని). పున్నమ్మ శేషయ్యల ఆయురారోగ్యములకు, వంశాభివృద్ధికి వారిని ఆశీర్వదించి మనంకూడా విరమిద్దాము.

లీలాబాలుఁడు

కోటమర్తి నాగేశ్వర శర్మ గారు

ఒకటే కింకను బదుమూఁడు నొనరఁ గూర్చి
బొంగరములను, మిగుల నుప్పొంగి నీవు
స్వేచ్ఛయను రజ్జువునఁ జుట్టి చిత్రగతిని
ద్రిప్పుచున్నావు, మంచిదే; తెలియఁ బలుకు
విసుగు పుట్టదో? క్షణమైన విడువలేవు

బాలకా! నీవు సామాన్యబాలకుఁడవె?
కనులు మూయవు మెతుకైనఁ దినవు నీవు
కష్టసుఖములు నీకు సిక్కంబులేవొ
పట్టుదల యొండె నాకుఁ గన్పట్టుచుండె
నెంతకాల, మిఁ కీయాట కంతు లేదె.